నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | మార్చి 26, 2025 | www.navatelangana.com

గోదావరిలో దూకి యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-దండేపల్లి

లక్షెట్టిపేట మండల కేంద్రంలోని మహాలక్ష్మివాడకు చెందిన భూమి విష్ణువర్ధన్(22) కడుపు నొప్పి భరించలేక గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తాహసినుద్దీన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..యువకుడు ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొద్ది రోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కడుపు నొప్పి భరించలేక సోమవారం ఇంటి నుండి బయలుదేరి వెళ్లాడు. గూడెం గోదావరి నది వంతెనపై ద్విచక్ర వాహనాన్ని చూసి స్థానికులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గోదావరిలో విష్ణువర్ధన్ మృతదేహం లభ్యమైంది. మృతుని అన్న మణిదీప్ ఫిర్యా మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్ఎంపీ క్లినిక్‌పై టీజీఎంసీ తనిఖీ

మంచిర్యాల : టీటీజీఎంసీ ఇతికల్ కమిటీ, ఐఎంఎ, టాస్క్‌ఫోర్స్ బృందాలకు అందిన ఫిర్యాదుల మేరకు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఆదేశానుసారం మంగళవారం బోయపల్లిలో ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌లో తనిఖీలు చేశామని టిజిఎంసి మెంబర్ ఎగ్గేన శ్రీనివాస్ తెలిపారు. మందల సదానందం క్లినిక్ నడుపుతూ మోతాదుకు మించి అంటిబయోటిక్ మందులు, నొప్పి మందులు, ఐవి ఫ్లూయిడ్స్, ఇతర హైడోస్ మందులు ఇస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నాడని తెలిపారు. ఇలాంటి నకిలీల బారినపడి ప్రజలు మోసపోయి ఆరోగ్యాలు పాడుచేసుకోవద్దని సూచించారు. తనిఖీల్లో డాక్టర్‌లు ఉదయ్ కుమార్, అరవింద్, సంతోష్, ప్రవీణ్, రాజు, టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు పాల్గొన్నారు. ప్రజలు నకిలీ వైద్యులపై ఫిర్యాదులు చేయాలనుకుంటే సెల్ 7557555777ను సంప్రదించాలని కోరారు.



విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారి కల్పన



నవతెలంగాణ-తాండూర్

రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన సూచించారు. ఆమె మంగళవారం కన్నాల గ్రామ రైతువేదికలో వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఆమోదించబడిన విత్తనాలు నాణ్యత కలిగి ఉంటాయని, అధికంగా మొలక శాతం వస్తాయని తెలిపారు. అనుమతి పొందిన విత్తన కంపెనీలు విత్తనాలను శుద్ధి చేయడం వల్ల చీడపీడల సమస్య తక్కువగా ఉంటుందన్నారు. రైతులు ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలు నాటితే నష్టపోతే నష్టపరిహారం వర్తిస్తుందని తెలిపారు. రైతులు కలుపు సమస్య వల్ల అవగాహన లేమితో ప్రభుత్వ అనుమతి లేని బోల్‌గార్డ్-3 పత్తి విత్తనాలపై మొగ్గుచూపుతున్నారన్నారు. పత్తిలో కలుపు నివారణకు ప్రభుత్వ అనుమతి పొందిన పిండి మిథాలీన్, పిరిథయోబ్యాక్ సోడియం వంటి కలుపు మందులను పిచికారి చేసి కలుపు నివారించుకోవచ్చని తెలిపారు. పత్తిలో కలుపు నివారణకు ప్రభుత్వ అనుమతి లేని గ్లైపోసిట్ వాడడం వల్ల దుష్ప్రభావాలు ఉన్నాయని తెలిపారు. ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏడీఏ రాజానరేందర్, బెల్లంపల్లి ఏవో ప్రేమ్‌కుమార్, తాండూర్ ఏవో సుష్మ, ఉద్యాన అధికారి అర్చన, గురజాల ఎస్సై రమేష్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం దందా..!

- పొరుగు రాష్ట్రానికి యథేచ్ఛగా రవాణా
- పట్టుబడుతున్నా మారని అక్రమార్కుల తీరు
- అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న వైనం
- నియంత్రణపై పూర్తిస్థాయిలో దృష్టిసారించని అధికారులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రేషన్ బియ్యం దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ప్రతి రోజూ జిల్లా నుంచి పొరుగు రాష్ట్రానికి అక్రమంగా తరలిపోతోంది. క్వింటాళ్ల కొద్ది బియ్యం అక్కడికి వెళ్తున్నా అధికారుల నిఘా జాడలేకుండా పోతోంది. అప్పుడప్పుడు పట్టుబడుతున్నా ఈ దందా పూర్తిస్థాయిలో నియంత్రణలోకి రావడం లేదు. అక్రమార్కులపై అధికారులు తూతూ మంత్రపు కేసులు నమోదు చేసి వదిలేయడంతో దళారులు మళ్లీ ఇదే దందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వందల క్వింటాళ్ల బియ్యం పట్టుబడినా.. ఇంకా అనేక చోట్ల నుంచి అధికారుల కండ్లు గప్పి మహారాష్ట్ర ప్రాంతానికి తరలిపోతోందనే ప్రచారం జరుగుతోంది. కొన్నేండ్ల నుంచి వరుసగా లారీలు, వ్యాన్లలో తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్నాయి. కానీ పూర్తిస్థాయిలో నియంత్రణ కావడం లేదనే విమర్శలున్నాయి. అడ్డుకోవాల్సిన పౌరసరఫరాలశాఖ అధికారులు ఇటువైపు దృష్టిసారించడం లేదనే ఆరోపణలున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో రేషన్ బియ్యం దందా మూడు పువ్వులు..ఆరు కాయలుగా మారుతోంది. తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించాల్సి రావడంతో అక్రమార్కులు ఈ దందాను విడిచిపెట్టడం లేదు. పోలీసుల తనిఖీల్లో అక్కడక్కడ పట్టుబడుతున్నా అక్రమార్కుల తీరు మారడం లేదు. రేషన్ దుకాణాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి కొన్ని క్వింటాళ్ల వరకు జమ చేసి ఒకేసారి వాహనంలో జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలో ఈ బియ్యానికి మంచి డిమాండ్ ఉండటంతో పాటు వారు అధిక ధర వెచ్చించి కొనుగోలు చేయడంతో అనేక మంది దళారులు ఈ దందాను ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రతి ఏటా వందల క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉమ్మడి జిల్లా నుంచి తరలిపోతున్నా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయడం లేదనే విమర్శలున్నాయి. పలు చోట్ల తనిఖీల్లో పట్టుబడుతున్నా కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల సిర్పూర్(టి)లో మూడు వ్యాన్లు పట్టుబడగా.. ఏడుగురు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. వారం రోజుల క్రితం ఉట్నూర్ కేంద్రంలో 20క్వింటాళ్లు పట్టుబడగా.. తాజాగా రెండు రోజుల క్రితం ఇచ్చోడ జాతీయ రహదారిపై 290క్వింటాళ్ల బియ్యం లారీని పట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజుల వ్యవధిలోనే వందల క్వింటాళ్ల రేషన్ బియ్యం పక్క రాష్ట్రానికి తరలిపోయిన సంఘటనలున్నాయి.

అక్రమ మార్గాల్లో తరలింపు..!

రేషన్ బియ్యం దందా చేస్తున్న దళారులు స్థానికంగా ఉండే రేషన్ దుకాణాల నుంచి బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఈ దొడ్డు బియ్యం తినలేని అనేక మంది లబ్ధిదారులు రేషన్ దుకాణాల నుంచి బియ్యాన్ని తీసుకొని కిలోకు రూ.10చొప్పున దళారులకు విక్రయిస్తున్నారు. కొందరు రేషన్ దుకాణదారులు సైతం ఇలాంటి వాటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క కొందరు దళారులు పట్టణాలు, గ్రామాలు తిరుగుతూ ఈ బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని పెద్ద మొత్తంలో ఒక దగ్గర పోగు చేసి ఒకేసారి వాహనాల ద్వారా పొరుగు రాష్ట్రానికి తరలిస్తున్నారు. అక్కడ కిలోకు రూ.20 నుంచి రూ.30వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా విశాలంగా ఉండటం.. మహారాష్ట్రకు వెళ్లేందుకు అనేక దారులు ఉండటం కూడా అక్రమార్కులకు కలిసివస్తోందని తెలుస్తోంది. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ప్రతి నిత్యం వాహనాల ద్వారా అక్రమ మార్గాల్లో ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దున ఉన్న మహారాష్ట్రలో గల ఓ గ్రామంలో ఈ బియ్యం కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా కేంద్రాన్ని తెరిచినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తనిఖీ కేంద్రాల నుంచి ఈ బియ్యం వాహనాలు వెళ్తున్నా చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఈ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన పౌరసరఫరాలశాఖ అధికారులు అంతగా దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి. ఎక్కడికక్కడ దాడులు చేసి అడ్డుకోవాల్సి ఉండగా.. వారికి ఇతర ప్రభుత్వ పనులు అప్పగించడం కారణంగా అసలు పనిపై దృష్టిసారించడం లేదని అధికారవర్గాలు చెబుతున్నాయి.



రేషన్ బియ్యం తరలిస్తూ ఉట్నూర్‌లో పట్టుబడిన ఐచర్(ఫైల్)

భోజనం కూడా చేయనివ్వని కేకే ఓసీ మేనేజర్



నవతెలంగాణ-మందమర్రి

కార్మికులను భోజనం కూడా పూర్తి చేయకుండానే మేనేజర్ పని ప్రదేశాల్లోకి పంపి ఇబ్బందులు పెడుతున్నారని ఏఐటీయూసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక సమస్యలు తెలుసుకోవడానికి ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ సత్యనారాయణ మంగళవారం కెకె ఓసీపీని సందర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఓసీలో భోజన విరామ సమయంలో భోజనం చేస్తుండగానే గని మేనేజర్ సూపర్‌వైజర్లతో కార్మికులపై ఒత్తిడి చేస్తూ భోజనం కూడా పూర్తి చేయకుండానే పని ప్రదేశాల్లోకి పంపి ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 70సంవత్సరాల నుండి సింగరేణిలో ప్రతి గని, డిపార్ట్మెంట్‌లలో కార్మికులు పూజలు చేస్తున్న మైసమ్మకి మూడు నెలలకు ఒకసారి మేకలతో మొక్కులు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కానీ ఇటువంటి కార్యక్రమాలు గని పరిధిలో ఎవరు కూడా చేయకూడదని ఓసీ మేనేజర్ ఆదేశాలు ఇచ్చి కార్మికుల మనోభావాలు దెబ్బతినే విధంగా ప్రవర్తించడం మానుకోవాలని పేర్కొన్నారు. ఓసి లోపల పనిచేస్తున్న మహిళలకు మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ ఏర్పాటు చేయకపోగా, స్పాటర్లను పెట్టకపోవడం, గొడుగులు ఇవ్వకుండా ఎండలో నిల్చుండపెట్టడం, సర్వే డిపార్ట్మెంట్లలో పనిచేస్తున్న కార్మికులకు గొడుగులు కల్పించకపోవడం, మహిళలకు లంచ్ చేయడానికి టేబుల్స్ ఏర్పాటు చేయకపోవటం సమస్యలపై కార్మికులు మేనేజర్ దృష్టికి తీసుకువెళ్తే ఇప్పుడు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీ సోమిశెట్టి రాజేశం, కెకె ఓసీ ఇన్‌చార్జి ఆర్నకొండ ఆంజనేయులు, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి జి సత్యనారాయణ, పి బానయ్య, దినేష్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ యాదవ్, కెకె 5 ఫిట్ సెక్రటరీ గాండ్ల సంపత్, కోటయ్య, రాజేశం పాల్గొన్నారు.

నీతి ఆయోగ్ కేంద్ర బృందం పర్యటన

నవతెలంగాణ-నార్నూర్

పీఎం అవార్డ్స్-2024 కోసం దేశ వ్యాప్తంగా 426 ఆస్పిరేషనల్ బ్లాక్‌లో టాప్-30లో నార్నూర్ ఎంపికైన సందర్భంలో మంగళవారం కేంద్ర బృందం మండలంలోని జామడ, గుంజల, నార్నూర్ ఎంపిడిఓ కార్యాలయం, నాగల్‌కొండలో పర్యటించింది. నీతి ఆయోగ్ డైరెక్టర్ మృత్యుంజయ ఝా, డిప్యూటీ సెక్రటరీ శుభోద్ కుమార్‌ను స్థానిక పెన్‌గంగ గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్ రాజర్షి షా మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను, జ్ఞాపికను అందజేశారు. అనంతరం నార్నూర్ మండలానికి వెళ్లారు. జామడ అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, శ్యామ్ మామ్ పిల్లల వివరాలపై ఆరా తీసి, సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆశ్రమ ఉన్నత పాఠశాల జామడను సభ్యులు సందర్శించారు. పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న విద్య, పాఠశాలలో ఉన్న కంప్యూటర్ ల్యాబ్ నిర్వహణ, డిజిటల్ క్లాసెస్ బోధన గూర్చి వివరించారు. గిరిజన బాలికల్లో రక్తహీనత నివారణకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రారంభించిన గిరిజన పోషణ్ మిత్ర కార్యక్రమం గురించి వివరించారు. ఆంగ్ల భాష నైపుణ్యాభివృద్ధి కోసం చేపట్టిన యంగ్ పోరిటెర్స్ క్లబ్ నిర్వహణ గురించి వివరించారు. అందులో భాగంగా ఏడవ తరగతి విద్యార్థిని మడావి తబితను యంగ్ ఒరేటర్స్ గురించి తన మాటల్లో చెప్పమన్నారు. విద్యార్థిని చాలా చక్కగా చెప్పడంతో శాలువాతో సన్మానించి అభినందించారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాలను తెలుసుకుంటూ పాఠశాల మొత్తం తిరిగి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గుంజాల గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారులకు అందించిన ఆటవస్తువులు, అంగన్వాడి టీచర్లు తయారు చేసిన పౌష్టికాహారం, కిచెన్ షెడ్‌ను పరిశీలించారు. మండల ప్రజాపరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులతో ముచ్చటించి, టాయిలెట్స్‌లను పరిశీలించారు. పల్లెదవాఖానాను సందర్శించి అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే పీఎం కిసాన్, భూసార పరీక్ష పత్రం, ఫార్మర్, ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌పై రైతులతో మాట్లాడారు. ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల ద్వారా తయారు చేసిన వస్తువులను పరిశీలించారు. రుణాలు పొంది ఎంత ఆదాయం పొందుతున్నారని అడిగి తెలుసుకున్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలలో అభివృద్ధి, మార్పులు గురించి అడిగి తెలుసుకున్నారు. 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రక్త నిల్వల కేంద్రం, స్కానింగ్ కేంద్రాలను, ప్రసూతి వార్డును పరిశీలించారు. టీబీ పేషెంట్లకు నిక్షయ పోషణ కిట్స్ అందించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా, డీఆర్‌డీఓ రవీందర్‌రాథోడ్, డీఎంఅండ్‌హెచ్ఓ రాథోడ్ నరేందర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని సందర్శించి డాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

స్వచ్ఛందంగా ముందుకొచ్చాం

- స్పష్టం చేసిన కుల సంఘాల నాయకులు
- దివాకర్‌రావుపై మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-మంచిర్యాల

గోదావరిరోడ్‌లో నిర్మించిన మహాప్రస్థానం కోసం తాము స్వచ్ఛందంగా ఆర్థిక సాయం చేయడానికి ముందుకు వచ్చామని వివిధ కుల సంఘాల నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు బెదిరించడంతో చందాలు ఇస్తున్నామని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు చేసిన ఆరోపణలను ఖండించారు. సకల సౌకర్యాలతో ఎమ్మెల్యే నాలుగు ఎకరాల్లో మహాప్రస్థానం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తే ఓర్వలేని దివాకర్‌రావు ప్రేమ్‌సాగర్‌రావ్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో శ్మశాన వాటిక నిర్మాణం కోసం చందాలు ఎందుకు వసూలు చేశావని దివాకర్‌రావును ప్రశ్నించారు. మహాప్రస్థానం నిర్వహణ కోసం ప్రజల భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో మంచిర్యాల సంక్షేమ సంఘం పేరిట కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే మంచి నిర్ణయాలను దురుద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేయడం శోచనీయమన్నారు. ఎమ్మెల్యే బెదిరించాడనే ఆరోపణలు అసత్యమని ఆర్య వైశ్య సంఘం నాయకుడు అప్పాల రాము అన్నారు. ప్రజా సేవ చేయడంలో మార్వాడీ సమాజం ఎప్పుడు ముందు వరుసలో నిలుస్తుందని, అందులో భాగంగానే మహాప్రస్థానం నిర్వహణకు చందాలు ఇవ్వడానికి ముందుకు వచ్చామని మార్వాడీ సమాజ్ నాయకుడు పవన్ పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో సమావేశం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా పరిగణించారు. ఎక్కడ అక్రమాలు చేశారో..ఎవరిని బెదిరించారో దివాకర్‌రావు నిరూపించాలని డిమాండ్ చేశారు. వయసు మీద పడడం, అధికారం లేకపోవడంతో దివాకర్‌రావుకు మతిభ్రమించినట్లుగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఆయన తనయుడు విజిత్‌రావుకు మెరుగైన వైద్యం అందించాలని, అందుకు ప్రేమ్‌సాగర్‌రావు కూడా సహకరిస్తారని చెప్పారు. నస్పూర్‌లోని టీఎన్జీవో కాలనీలో బీఆర్ఎస్ నాయకులు భూములు కబ్జా చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, పలువురు మహిళ నాయకులు పాల్గొన్నారు.

పోడు రైతులను ఇబ్బంది పెట్టొద్దు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నో ఏండ్లుగా సాగు చేసుకుంటున్న పోడు రైతులను అటవీ అధికారులు ఇబ్బందులకు గురి చేయకూడదని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాల, చింతలమానేపల్లి మండలాలకు చెందిన పోడు రైతులతో కలిసి జిల్లా అటవీశాఖ కార్యాలయంలో డిఎఫ్ఓ నీరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్న పోడుసాగుదారులను ప్రస్తుతం అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని అన్నారు. వారు అడ్డుకోకుండా చూడాలని జిల్లా అటవీ శాఖ అధికారికి సూచించారు. అటవీ ప్రాంతంలో నివసిస్తున్నవారికి తాగు నీటి బోర్లు వేసుకునే అవకాశం కల్పించాలన్నారు. హక్కు పత్రాలు కలిగిన రైతులను పత్తి కట్టే తీసేందుకు అధికారులు ఇబ్బంది పెట్టొద్దన్నారు. పోడు భూముల్లో కందకాలు తవ్వకుండా చూడాలని, రెవెన్యూ, అటవీ శాఖల మధ్య నలుగుతున్న భూముల జాయింట్ సర్వే నిర్వహించి రైతులకు సాగు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీ డుబ్బుల నాన్నయ్య, మాజీ సర్పంచ్ కోడ్పు విశ్వేశ్వర్, గిరిజన నాయకులు పారుపల్లి పోశం, ఉమా మహేష్, సురేష్, పోడు రైతులు పాల్గొన్నారు.

ఫేక్ నంబర్ ప్లేట్ వాహనం సీజ్

ఆదిలాబాద్‌టౌన్ : ఫేక్ నంబర్ ప్లేట్‌తో వాహనం నడిపితే వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని భుక్తాపూర్‌లో వాహనాల తనిఖీలో రాథోడ్ సతీష్ టీఎస్01ఈఎం0070 అనే తప్పుడు నంబర్ ప్లేట్‌తో వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కాడు. దీంతో అతని బైక్ సీజ్ చేసి కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ట్రాఫిక్ చలాన్ నుండి తప్పించుకోవాలనే ఉద్దేశంతో ఇలాంటి చర్యలకు పాల్పడొద్దన్నారు. ఆర్టీఏ ఇచ్చిన నంబర్ ప్లేట్‌తోనే వాహనాలు నడపాలని సూచించారు.


మంత్రి పదవిపై ఉత్కంఠ..!

- ప్రయత్నం ముమ్మరం చేసిన ఎమ్మెల్యేలు
- తెరపైకి ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం బ్రదర్స్
- అగ్ర నాయకుల వద్ద లాబీయింగ్

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో మంత్రి పదవి ఎవరికి దక్కుతుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా తూర్పు ప్రాంత ఎమ్మెల్యేల మధ్యే పోటీ నెలకొంది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ నాయకులతో భేటి అయి మంత్రివర్గ విస్తరణపై చర్చించామని, త్వరలో విస్తరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు వెల్లడించారు. మంత్రి వర్గంలోకి ఎవరిని తీసుకోవాలనే దానిపై ఒక అవగాహనకు వచ్చినట్టు తెలుస్తోంది. కొత్తగా నలుగురికి మంత్రులుగా అవకాశం ఇవ్వాలని వస్తున్న వార్తల నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి ఎవరికి మంత్రి పదవి దక్కుతుందోనని ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు.

నవతెలంగాణ-మంచిర్యాల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. అందులో ముఖ్యంగా మంత్రి పదవిపై మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. చాలా కాలంగా అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రేమ్‌సాగర్‌రావు చాలా కష్టపడ్డారని, ఉమ్మడి ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవడంలో ముందున్నారని, ఆయనకే మంత్రి పదవి దక్కుతుందని అనుచరులు బలంగా నమ్ముతున్నారు.





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు వదలకుండా పీఎస్ఆర్ పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్నాడు. ఆర్థికంగానూ అండగా నిలిచాడు. అప్పటి సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క ఆదిలాబాద్ జిల్లా నుండి పాదయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. అది పార్టీకి కొత్త ఊపు తీసుకొచ్చింది. రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లిలో నిర్వహించిన సభతో కాంగ్రెస్ జిల్లాలో మరింత బలపడింది. బట్టి పాదయాత్ర ముగింపు సభ మంచిర్యాలలో ఏర్పాటు చేశారు. ఆ సభలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రేమ్‌సార్‌రావును మంత్రిని చేస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, బట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనకు మంత్రి పదవి వస్తే స్థానిక సంస్థల ఎన్నికలో క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి అవకాశం ఉన్నట్లు అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరో పక్క తమ ఇద్దరిలో ఒకరికి మంత్రిగా అవకాశం కల్పించాలని గడ్డం బ్రదర్స్ అధిష్టానాన్ని కోరుతున్నారు. అగ్ర నాయకుల వద్ద లాబీయింగ్ చేస్తున్నట్టు సమాచారం. వివేక్, వినోద్ పట్టు వదలకుండా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండగా, పార్టీ వివేక్ కొడుకు వంశీకృష్ణకు ఎంపీగా అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో గడ్డం బ్రదర్స్‌లో ఎవరికి మంత్రి పదవి ఇచ్చినా ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే మంత్రి పదవి ఆఫర్‌తోనే వివేక్ బీజేపీ నుంచి కాంగ్రెస్ గూటికి చేరినట్టు అయన సన్నిహితులు పేర్కొంటున్నారు. ఆ హామీ మేరకు వివేక్‌కు మంత్రి పదవి పక్కాగా వస్తుందని ఆయన మద్దతుదారులు గట్టిగా నమ్ముతున్నారు. మొత్తానికి మంత్రి పదవి ఎవరిని వరిస్తుందోనని ఉత్కంఠ మాత్రం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకొంది. మరో వైపు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రెండు మంత్రి పదవులు ఇచ్చే విషయం అధిష్టానం ఆలోచిస్తున్నట్లు నాయకులు చర్చించుకుంటున్నారు.

నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్మితే చర్యలు



నవతెలంగాణ-జైపూర్

నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్మితే కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు. మంగళవారం భీమారం మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుమందు దుకాణాలను వ్యవసాయాధికారి అత్తె సుధాకర్ ఎస్సై శ్వేతతో కలిసి తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వ ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి దుకాణంలో గల పిచికారి మందులను పోల్చి చూశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసిన రైతులకు వెంటనే రశీదు ఇవ్వాలని, రైతుకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీఓ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను మండల ఎంపీఓ గోవర్ధన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులు పరిశీలించారు. అనంతరం వంటగదికి వెళ్లి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు.

మార్కెట్ కమిటీ ఛైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని స్థానిక సొసైటీ బ్యాంకులో మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు ఖానాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పడిగెల భూషణ్‌ను మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వడంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముందుంటారని అన్నారు. మండలానికి చెందిన పడిగెల భూషణ్‌కు మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పదవీ బాధ్యతలు అప్పగించినందుకు గాను ఎమ్మెల్యేకు, కాంగ్రెస్ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మార్కెట్ కమిటీ ఛైర్మెన్ మాట్లాడారు. అనుక్షణం రైతు సంక్షేమానికి కృషి చేస్తూ, రైతు సోదరుల అభివృద్ధే తమ పాలకవర్గం ధ్యేయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ జిల్లా నాయకులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, లక్ష్మీపూర్ కాంగ్రెస్ నాయకులు రాజు, శంకర్, శేఖర్, హరీష్, సుధీర్, రాకేష్ పాల్గొన్నారు.

అరెస్టులతో సమస్యలు పరిష్కారం కావు

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్**

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

అక్రమ అరెస్టులు, లాటి చార్జీలతో సమస్యలు పరిష్కారం కావని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేల హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ వర్కర్స్‌ను ఎక్కడికక్కడ అరెస్టులు, హైదరాబాద్‌లో లాటిచార్జి కూడా చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వారన్నారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు పరచాలని డిమాండ్ చేశారు.

ఆశా వర్కర్లపై లాఠీచార్జీ అమానుషం



వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్

నవతెలంగాణ-ఖానాపూర్

ఆశ వర్కర్లపై పోలీసులు లాఠీచార్జీ చేయడం అమానుషమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ కలెక్టరేట్‌కు వెళ్లి తమ వేతనాలు పెంచమని అడిగితే మహిళలని చూడకుండా లాఠీచార్జ్ చేయడం అక్రమ అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. పోలీసులు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. కరోనా సమయంలో ఆశ వర్కర్‌ల సేవలను గుర్తించిన ప్రభుత్వాలే ఆశ వర్కర్ల ఉద్యమాన్ని ఆశ వర్కర్లను అణచివేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశ వర్కర్లకు నిర్ణీత వేతనం రూ.18వేలు ఇవ్వాలన్నారు. ఆశ వర్కర్లకు ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు వర్తింపజేయాలని, అదనపు పనులకు అదనపు వేతనం ఇవ్వాలని అన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పండగ సెలవులు, వారాంతపు సెలవులకు సర్క్యులర్లు ఇవ్వాలన్నారు. ఆశలకు పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.గంగామణి, మండల నాయకులు రజిత, త్రివేణి, వినోద, మమత, లక్ష్మీ పాల్గొన్నారు.

7వ రోజు సీసీఐ దీక్షలో పలు వార్డుల నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ కోసం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నయి. మంగళవారం ఈ దీక్షలు 7వ రోజుకు చేరుకోగా దీక్షలో 18, 19, 16 వార్డుల యువ నాయకులు కూర్చున్నారు. వీరికి సాధన కమిటీ కోకన్వీనర్లు కొండ రమేష్, బండి దత్తాత్రి, బొల్లు ఈశ్వర్‌దాస్ పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు. వారికి సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్, కోకన్వీనర్లు విజ్జగిరి నారాయణ, బండి దత్తాత్రి, బొల్లు ఈశ్వర్‌దాస్, అశోక్, పొచ్చక్క, అగ్గిమల్ల స్వామి, మాజీ కౌన్సిలర్ అశోక్ స్వామి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీఐ ప్రారంభిస్తే జిల్లాలో యువతకు ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. వెంటనే సీసీఐ ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోవ రవి, భగత్ నరేష్, రాచర్ల శరత్, మడవి రామేశ్వర్, మధు, ఓమ్, వికాస్, రవి, సంజు, యోగేష్, మోహన్, శ్రీను, శివ, అశోక్ ఉన్నారు.

ఐకేపీ వీఓఏల ముందస్తు అరెస్టు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో లక్ష్మణచాంద మండలంలోని ఐకేపీ వీఓఏలను మంగళవారం ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.26 వేల వేతనం ఇవ్వాలని, రూ.5 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని అన్నారు. అదేవిధంగా గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో శ్రీకాంత్, జీవన్, నరేష్, శ్రీలత, జానకి, లక్ష్మి, సింధూజ, నళిని ఉన్నారు.

కేవీకే సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలి

- **ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ హైదరాబాద్ డైరెక్టర్ యకాద్రి**
- **పత్తి సాగుపై రైతులకు అవగాహన**



రైతులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ యూనివర్సిటీ డైరెక్టర్ యకాద్రి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పత్తికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, దాన్ని పండించే రైతులు వ్యవసాయశాఖ, కేవీకే శాస్త్రవేత్తలు చెప్పే సూచనలు పాటిస్తూ, అధిక దిగుబడులు సాధించాలని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటి హైదరాబాద్ డైరెక్టర్ యకాద్రి అన్నారు. మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రంలో ఐసీఏఆర్ నాగ్‌పూర్, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కిసాన్ మేళాను నిర్వహించారు. ఇందులో ప్రధానంగా అధిక సాంద్రతతో పత్తి సాగుపై రైతులకు అవగాన కల్పించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ప్రొజెక్టర్ ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ద్వారా చేపట్టిన కార్యక్రమాలు, పంటల వివరాలు, దిగుబడుల గురించి తెలియజేశారు. కిసాన్ మేళా సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఆయా విత్తనాలు, పరికరాల స్టాళ్లను రైతులు సందర్శించి, వాటి వివరాలను తెలుసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి మంచి డిమాండ్ ఉందని, రైతులు ఆ పత్తి పంటను అధిక సాంద్రతతో సాగు చేస్తే మంచి దిగుబడి వచ్చి లాభాలు వస్తాయని అన్నారు. కష్టానికి ఫలితం కూడా వస్తుందని చెప్పారు. సులువుగా చీడపీడల నుంచి రక్షణ కూడా పొందవచ్చని వివరించారు. పత్తి నాణ్యతగా ఉంటే విదేశాల్లో మంచి ధర పలుకుతుందన్నారు. దీంతో విదేశీ మారకద్రవ్యం పెరిగి రైతులకు మంచి ధర వస్తుందన్నారు. పత్తి పంట తరువాత పొలం తేమ ఉంటుందని, దానికి ఇతర పంటలు వేసుకుంటే మంచి దిగుబడి కూడా వస్తుందన్నారు. పత్తితో పాటు అంతరపంటలను వేసుకొని మంచి లాభాలు పొందాలని సూచించారు. వ్యవసాయ శాఖ, కేవీకే శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ పంటలను మార్పిడి చేస్తునే, అధిక సాంద్రతతో పత్తి సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్ నాగ్‌పూర్ నోడల్ అధికారిణి శాంతి, ఏడీఆర్ సుజాత, ప్రొగ్రాం అధికారి ప్రవీణ్ కుమార్, వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ శ్రీధర్ చౌహన్, శాస్త్రవేత్తలు రాజశేఖర్, రాంప్రసాద్, సునీల్, రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ వినోద్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వినోద్ మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా వివిధ గ్రామాల నుంచి వివిధ పనులపై వచ్చే ప్రజలకు చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు పెరగడంతో మండల ప్రజలు ఉదయమే పనులు చేసుకొని తిరిగి మధ్యాహ్నం 12 గంటలలోపు ఇండ్లకు చేరుకోవాలన్నారు. వడ దెబ్బకు బారిన పడకుండా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రోహిదాస్, రెవెన్యూ సిబ్బంది సాయిరాం, హరికాంత్, నరేందర్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారులపై వీధి కుక్కల దాడి




నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాజులపేట్ కాలనీలో మంగళవారం వీధి కుక్కలు ఐదుగురు చిన్నారుల పైన దాడి చేశాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అందులో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో వారి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్న అధికారులు ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని అక్కడి ప్రజలు వాపోతున్నారు.

రిమ్స్‌లో అన్నదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ ఆవరణలో శ్రీయువ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఛైర్మెన్ రోహిత్ మిత్రులు మంగళవారం అన్నదానం చేశారు. రిమ్స్‌లో నిత్యం ఉదయం రోగి సహయకులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 212 రోజులుగా నిత్యం అన్నదానం చేస్తున్నామని తెలిపారు. సేవ చేయాలనే లక్ష్యంతో యువశక్తి ఫౌండేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వ్యవస్థాపక అధ్యక్షుడు రోహిత్ తెలిపారు. కార్యక్రమంలో నరేష్, సాయి, శివ, తోఫిక్, కన్న, భూపేందర్, సోమ ప్రశాంత్, కమ్లెష్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై ప్రావీణ్యాన్ని పెంచుకోవాలి

- **ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా**



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా

నవతెలంగాణ-ఉట్నూర్

ఆంగ్లభాషపై విద్యార్థులు ప్రావీణ్యాని పెంచుకొని, భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అన్నారు. మంగళవారం ఉట్నూర్ పీఎమ్మార్సీ సమావేశ మందిరంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ వక్తల సమావేశాన్ని ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. ఉపాధ్యాయుల సామర్థ్యాలను పెంపొందించేందుకు బోస్ సంస్థ చేస్తున్న కృషి చేస్తుందన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంస్థ అందిస్తున్న సేవల వల్ల సత్ఫలితాలిస్తున్నాయని అన్నారు. వేసవి సెలవుల్లోను విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. వచ్చే విద్యా సంవత్సరంలోను ఆంగ్లంలో ప్రావీణ్యాన్ని పెంపొందించేందుకు సంస్థతో కలిసి మరిన్ని కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎసీఎం జగన్ మాట్లాడుతూ విద్యార్థి తలరాతను మార్చేది ఉపాధ్యాయుడని, శిక్షణ అంశాలను పిల్లలకు అందేలా చూడాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శించిన సాంస్కృతిక, ఆంగ్ల నాటికలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో ఎసీఎంఓలు పుర్క ఉద్ధవ్, రాథోడ్ శివాజీ, గిరిజన క్రీడలాధికారి కె. పార్థసారథి, దేవరావు, బోస్ సంస్థ నిర్వాహకులు రోమిల, నిక్షిత పాల్గొన్నారు.

పెండింగ్ కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

వసతిగృహా విద్యార్థుల పెండింగ్ కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని జిల్లా కోకన్వీనర్ మెడపట్ల నితిన్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని గాంధీనగర్ ఎస్సీ బాయ్స్ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు విషయాలు మాట్లాడారు. విద్యార్థులు హాస్టల్ నుంచి పాఠశాలకు కాలినడకన వెళ్తున్నారని, విద్యార్థులకు బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. అంతేకాకుండా విద్యార్థులకు రెగ్యులర్ మెడికల్ టెస్టులు చేయాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు.

నవోదయలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు





నవతెలంగాణ-ఇచ్చోడ

నవోదయ ఫలితాలలో సన్‌షైన్ స్కూల్ చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మండల కేంద్రంలోని సన్‌షైన్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న పాముల సిద్దార్థ అంబేద్కర్, పాముల గౌతమ్, చౌహన్ వృథ్వి రాజ్‌లు నవోదయ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి జనవరి 18న పరీక్షలు రాయగా, మంగళవారం ఫలితాలలో సన్‌షైన్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు, దీనితో పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్, స్కూల్ యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

పనిముట్ల కోసం మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-పెంబి

వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా సబ్సిడీలో వ్యవసాయ పనిముట్ల కోసం అర్హులైన మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని పెంబి మండల వ్యవసాయ అధికారి నవీన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి సంబంధించిన వివరాలను ప్రకటించారు. ఈ పథకంలో భాగంగా మహిళలకు 50శాతం సబ్సిడీ వర్తించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళా రైతులు దరఖాస్తు ఫారంతో పాటుగా పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, కుల ధృవీకరణ పత్రం, రెండు పాస్ పోర్టు సైజ్ ఫోటోలతో మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని గాంధీ విగ్రహానికి వినతి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గాంధీ పార్కులోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ చలో హైదరాబాద్ వెళ్లిన ఆశలను ఎక్కడికక్కడ మహిళలని చూడకుండా పోలీసులు ఒకరోజు ముందు ప్రతి ఆశ ఇంటికి వెళ్లి ఉదయం నాలుగు గంటల నుంచి అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, పోరాటం చేసే క్రమంలో ఆశాలను నిర్బంధించడం సమంజసం కాదని అన్నారు. పోలీసుల తీరు మార్చుకోవాలనీ అత్యుత్సాహంతో అరెస్టు చేసిన పోలీసులు ఆశాలకు క్షమాపణ చెప్పాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు కనీస వేతనం రూ.18వేలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ప్రమాద బీమా సౌకర్యం రూ.50 లక్షలు ఇవ్వాలని అన్నారు. ఈ బడ్జెట్ సమావేశాలు ముగిసేలోపు తమ డిమాండ్స్ నెరవేర్చేంత వరకు ఇటువంటి నిర్బంధాలు ఎన్ని వచ్చినా తమ పోరాటాన్ని ఆపేది లేదని, తమ సమస్యలు వెంటనే పరిష్కరించని యెడల రాబోయే కాలంలో సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-కడెం

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని మండల పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొర్రె నరేష్, శనిగారపు రాజన్న డిమాండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం మండల పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, ఎంపీడీఓ అరుణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పంచాయితీ కార్మికులకు గత 4 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, కనీస వేతనం రూ.16వేల 500 ఇవ్వాలని, మల్టి పర్పస్ విధానం రద్దు చేయాలని, కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న అల్లూరి మల్లారెడ్డి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు ఉర్దూ అకాడమీ ఛైర్మెన్ తాహెర్ బిన్ అమ్దాన్, నిర్మల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ అఫ్సర్, శుభకరన్, యూసుఫ్ జాహి, నిర్మల్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మెన్ పాల్గొన్నారు.

దేవరకోట ఆలయ ఛైర్మెన్‌కు నోటీసులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని పురాతన దేవరకోట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఛైర్మెన్ కొండ శ్రీనివాస్‌కు అసిస్టెంట్ కమిషనర్ నవీన్ ఆదేశాల మేరకు ఆలయ ఇన్‌చార్జీ ఈఓ భూమన్న నోటీసులు అందజేశారు. గత ఏడాది అక్టోబర్‌లో నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నుంచి అన్నదానం, అల్పాహారం, ధనుర్మాస ఉత్సవాలకు (వైకుంఠ ఏకాదశి) భక్తుల కానుకలు, విరాళాల పూర్తి వివరాలు ఐదు రోజుల్లో చూపించాలని నోటీసులో పేర్కొన్నారు.

న్యాయవాద రక్షణ చట్టాన్ని తీసుకురావాలి

- **విధులు బహిష్కరించి నిరసన**

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాయాన్ని కాపాడే న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతుందని, ప్రభుత్వాలు వెంటనే న్యాయవాద రక్షణ చట్టాన్ని తీసుకురావాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో న్యాయవాది ఎర్రబాపు ఇజ్రాయెల్ హత్యను నిరసిస్తూ మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్రాల నగేష్ మాట్లాడుతూ మహిళపై దాడి జరుగుతుంటే అడ్డుకుంటే పోలీసు కేసు పెట్టించారని కక్ష్య పెంచుకొని న్యాయవాది ఇజ్రాయెల్‌ను దస్తగిరి హత్య చేశారన్నారు. న్యాయాన్ని కాపాడిల్సిన తమకే రక్షణ లేకుండా పోతుందన్నారు. రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయన్నారు. న్యాయవాద రక్షణ చట్టం తీసుకురావాలని కోరుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. న్యాయవాదులపై దాడుల నివారణకు కృషి చేయాలని, లేని పక్షంలో పూర్తి స్థాయిలో విధులు బహిష్కరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సుధీర్, నారాయణ స్వామి, మహ్మద్ సాబీర్, ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | మార్చి 26, 2025 | www.navatelangana.com

ఉద్యోగోన్నతి బాధ్యత పెంచుతుంది : ఎస్పీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఉద్యోగోన్నతి బాధ్యతను మరింత పెంచుతుందని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు అన్నారు. స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఏఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందిన మెంగరావుకు ఉద్యోగోన్నతి చిహ్నం ఇస్తూ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగంలో ఉద్యోగోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందన్నారు. ఇప్పటివరకు చేసిన పనికి రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. ప్రత్యేక బ్రాంచ్‌లో మెంగరావ్ సేవలను అభినందించారు. పోలీస్ శాఖ మీద మరింత గౌరవం పెరిగేలా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ రాణాపతాప్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-జైనూర్



మండలంలోని రాంనగర్ గ్రామపంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు మంగళవారం తీర్మానం చేశారు. ఈ మేరకు తీర్మాణ కాపీలను ఎంపీడీఓ సుదర్శన్ రెడ్డి, జిల్లా పంచాయతీ శాఖ అధికారికి బిక్షపతి గౌడ్‌కి పంపించారని గ్రామ నాయక్ రాథోడ్ రాందాస్ తెలిపారు. కార్యదర్శి గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రోజువారిగా గ్రామాన్ని సందర్శించడం లేదని ఆరోపించారు. గ్రామాల్లో కరెంట్, నీటి సమస్య అధికంగా ఉందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్న కార్యదర్శి తమ గ్రామ పంచాయతీకి వద్దని తీర్మానించామన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-జైనూర్



రెండు రోజుల క్రితం లింగాపూర్ మండలంలోని కొత్తపల్లి(సి) గ్రామంలో నీటి సరఫరా లేక ఇబ్బంది పడుతున్న వైనాన్ని నవతెలంగాణ కథనం ప్రచురించింది. దీంతో అధికారులు స్పందిస్తూ గ్రామంలో మంగళవారం నుండి నీళ్ల అందించారు. 20 రోజుల నుండి గ్రామంలో కనీసం తాగడానికి నీళ్ల కూడా లేకపోవడంతో గ్రామస్తులకు ఎంతో ఇబ్బంది పడ్డారు. గ్రామ ప్రజల సమస్యను నవతెలంగాణ అధికారుల దృష్టికి తీసుకొని రావడంతో స్పందించి నీటి సరఫరాయ్యేలా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తు అధికారులకు ధన్యవాదలు తెలిపారు.

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

నాలుగు రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎం) సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ కోరారు. అకాల వర్షాలు, వడగండ్ల వల్ల వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బ తిన్నాయన్నారు. సర్వే చేసి వివరాలను సేకరించి నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించాలన్నారు. 2024-25 యాసంగి పంటలు కోతకు వచ్చే తరుణంలో 4 రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వర్షం వల్ల పంటలు దెబ్బ తిన్నాయన్నారు. జిల్లాలో భారీ నష్టం జరిగిందని తెలిపారు. మొక్కజొన్న, కోతకు వచ్చిన వరి, మామిడిపూత, కూరగాయలు తదితర పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఇంటికిపై కప్పు కూలి ఒకరు మరణించారన్నారు. ఎకరాకు రూ.10,000ల పరిహారం ఇస్తానన్న ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నామమాత్రం సాయం రైతులకు పెట్టిన పెట్టుబడిలో మూడవ వంతుకూడా రాదని తెలిపారు.పంట నష్టాల వివరాలకు సేకరించి, పూర్తి పరిహారాన్ని రైతులకు చెల్లించాలని కోరారు. రానున్న నెల రోజుల్లో వర్షాలు పడే పరిస్థితి ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించిందని ముందు జాగ్రత్త చర్యగా రైతులకు సలహాలు, సాయం అందించాలన్నారు.

నేడు రేషన్ డీలర్ల సమావేశం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని డీలర్ల సమావేశాన్ని బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రియాజ్ హైమద్ తెలిపారు. డీలర్లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏప్రిల్ ఒకటో తేదీ నుండి సన్న బియ్యం పంపిణీ చేయడం కోసమే ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి డీలర్ తప్పనిసరగా హాజరుకావాలని, సమావేశానికి హాజరు కానీ డీలర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి డీలర్ ఈ సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు ఏఓ రామకృష్ణ తెలిపారు. శనివారం ఫర్టిలైజర్ వ్యాపారస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేసవిలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇది ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వంశీ, ఆనంద్, రోహిణి, లావణ్య ఫర్టిలైజర్ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆధ్యాత్మిక మార్గంలో నడచి భగవంతుని కృపకు పాత్రులు కావాలని ప్రముఖ సినీ టివి నటులు రచయిత దండనాయకుల సురేష్ కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కేస్లాపూర్ వీరంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ మాల దీక్షపరుల ఆహ్వానం మేరకు భిక్ష కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కేస్లాపూర్ వీరంజనేయ స్వామి ఆలయ విశిష్టతను గురించి భక్తులకు తెలిపారు. అనంతరం అలయకమిటీ ఆధ్వర్యంలో నాగబాల సురేష్ కుమార్‌ను ఆంజనేయ స్వామి చిత్ర పటం అందించి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, పిన్న వివేక్, గడ్డల వెంకటేష్, సుధాకర్, సంతోష్ పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

నవతెలంగాణ-కాగజ్‌నగర్

2025-26 విద్యాసంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరు, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశపరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలైనట్లు విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశం కోసం ప్రవేశపరీక్షను జనవరి 18న, తొమ్మిదో తరగతిలో ప్రవేశం కోసం ప్రవేశపరీక్షను ఫిబ్రవరి ఎనిమిదో తేదీన నిర్వహించారు. ఆరో తరగతిలో 80 సీట్ల భర్తీ కోసం ప్రవేశపరీక్ష నిర్వహించగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5 వేలకుపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఆరో తరగతిలో ఎంపికైన వారికి ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లో, తొమ్మిదో తరగతిలో ఎంపికైన వారికి 5వ తేదీన కాగజ్‌నగర్‌లోని నవోదయ విద్యాలయంలో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉంటుందని వివరించారు. ఎంపికైన విద్యార్థులకు తామే సమాచారం అందించనున్నట్లు తెలిపారు.

ఆశాలకు రూ.18వేల వేతనం ఇవ్వాలి



కాగజ్‌నగర్ : ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు తన మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఆశా వర్కర్లకు రూ.18వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం పట్టణంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. బాలాభారతి హైస్కూల్ నుండి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ చౌక్ మీదుగా రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు నిరసన ప్రదర్శన సాగింది. ఈనెల 24న జరిగిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకొని ఆశా వర్కర్లను అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడాతూ ఆశా వర్కర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఇస్తామన్న రూ.18 వేల వేతనం ఇవ్వాలని అడుగుతుంటే ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం సంఘటిత అసంఘటిత స్కీమ్ వర్కర్ల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఎక్కడకక్కడ నిర్బంధిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలనలో ప్రజా సమస్యలు తెలుపుకునే హక్కు కూడా లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ఆశా వర్కర్లు శాంతియుతంగా తమతమ సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌ను కలవడానికి చలో హైదరాబాద్ నిర్వహిస్తుంటే నిర్బంధకాండను ప్రయోగించడం సరైన పద్ధతి కాదన్నారు. ఆశా వర్కర్లతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆశా వర్కర్ల ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా రూపకల్పన చేసి ఈ రాష్ట్రాన్ని స్పందింపచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ, నాయకులు పంచశిల, జయ, జమీల, దమయంతి, సురేఖ, సుమలత, సంధ్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న ఆశాలను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని తప్పుపడుతూ మండలంలో ఆశాకార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హక్కుల సాధన కోసం హైదరాబాద్ వెళ్తున్న ఆశాలను నిర్బందించడం దారుణమని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు శ్రీలత, శిరీష, సుజాత, రాజేశ్వరి పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులు సిగ్గు చేటని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు నిరసన చేస్తుంటే ప్రభుత్వం పోలీసులు చేత అమానుషంగా దాడి చేసి అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని, ఏ ప్రభుత్వమైనా స్కీం వర్కర్ల సేవలు వినియోగించుకొని వారి సమస్యలను పరిష్కరించే చొరవ తీసుకోవాలన్నారు. కానీ ఇలా దాడులు చేయించొద్దన్నారు. మంగళవారం మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులు ఆశాలపై అక్రమ అరెస్టులు, లాఠీ ఛార్జిలో గాయపడిన నారాయణ పేట జయమ్మ అనే ఆశాతో పాటు చాలా మంది ఆశాల పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. పోలీసులనే కాదు మిలటరీ బలగాన్ని పిలుపించుకొన్న అడ్డుకోలేవని ఆశాల ఉధృత పోరాటాన్ని తట్టుకోలేరని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కేసరా, శాంత, సునీత నిర్మల, శారదా, పీహెచ్‌సీ పరిధి ఆశాలు పాల్గొన్నారు.



సిర్పూర్(టి) : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశాలు, సీఐటీయూ నాయకులు

మున్సిపాలిటీ మార్కెట్ పాత స్థలంలోనేనా..?

- దిన సంతకు అధికారుల ఏర్పాట్లు • ఈ నెల 28న టెండర్లకు సిద్ధం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో పాత మార్కెట్ స్థలంలోకి మళ్ళీ కూరగాయల మార్కెట్ రానుందా అనే ప్రశ్నకు అవుననే సమాధానం వస్తున్నట్లు తెలుస్తోంది. 2021 వరకు వివేకానంద చౌక్ ప్రాంతంలో కూరగాయల మార్కెట్ కొనసాగగా మార్కెట్ కోసం ప్రత్యేకంగా జూబ్లీ మార్కెట్ వద్ద షెడ్లు నిర్మించడంతో మార్కెట్ అక్కడికి తరలి వెళ్ళింది. తాజాగా మున్సిపల్ అధికారులు దిన సంతకు టెండర్లు పిలవడంతో మార్కెట్ మళ్లి ప్రారంభమవుతుందని వాదనలు వినిపిస్తున్నాయి.

మున్సిపాలిటీ మార్కెట్ పాత స్థలంలోనేనా?

ఎన్నో సంవత్సరాల నుండి ఆసిఫాబాద్ పట్టణంలోని వివేకానంద చౌక్ వెనక గల ఖాళీ ప్రదేశంలో కూరగాయల మార్కెట్ కొనసాగుతుంది. అయితే 2016లో జిల్లా కావడం తర్వాత జిల్లా కేంద్రంలో జనాభా పెరగడంతో అవసరాల రిత్యా జూబ్లీ మార్కెట్ నిర్మించి కూరగాయల మార్కెట్‌తో పాటు చికెన్, మటన్, చేపల మార్కెట్ కూడా 2021 మే నెలలో అక్కడికి తరలించారు. గత సంవత్సరం ఫిబ్రవరి నెలలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఆవిర్భవించడం జూబ్లీ మార్కెట్ ప్రాంతం రాజంపేట గ్రామపంచాయతీకి వెళ్లడంతో మున్సిపాలిటీకి కూరగాయల మార్కెట్ లేకుండా పోయింది. తాజాగా అధికారులు పాత మార్కెట్ స్థలం ఖాళీగా ఉండడంతో అక్కడే కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

దిన సంతకు అధికారుల ఏర్పాట్లు

మున్సిపాలిటీ పరిధిలో కూరగాయలకు సంబంధించిన సరైన ప్రాంతం లేకపోవడంతో సంవత్సర కాలం నుండి మార్కెట్ ఏర్పాటు కోసం మున్సిపల్ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే పాత మార్కెట్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి టెండర్లు పిలిచిన అది నిర్మాణ దశకు రాలేదు. దీంతో ఆ స్థలం ఖాళీగా ఉండి చెత్తాచెదారంతో నిండుతుంది. అదే స్థలంలో తిరిగి కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియను కూడా అధికారులు ప్రారంభించారు. ఈనెల 28న టెండర్ నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. పాత మార్కెట్ స్థలంలో దిన సంత ఏర్పాటు చేస్తున్నారా..? అని కమిషనర్‌ను అడగడానికి ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.



జిల్లా కేంద్రంలోని పాత మార్కెట్ స్థలం

పార్కింగ్ స్థలంతో పరేషాన్

ఇప్పటికే ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా మారడంతో ట్రాఫిక్ పెరిగింది. వివేకానంద నుండి పొట్టి శ్రీరాములు చౌక్ వరకు దుకాణ సముదాయాలు ఉండడంతో వినియోగదారులు పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయల మార్కెట్ కూడా ఇదే స్థలంలోకి వస్తే జూబ్లీ మార్కెట్ వెళ్లే వారి సంఖ్య తగ్గడంతో పాటు పార్కింగ్ స్థలంతో కూడా ఇబ్బందులయ్యే అవకాశం ఉంది. అధికారులు ముందుగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసిన తర్వాత కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తే బాగుంటుందని జిల్లా వాసులు అభిప్రాయపడుతున్నారు.

సామర్థ్యాల పెంపుకు ఏఐ దోహదం

- సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



కాగజ్‌నగర్ : ఏఐ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కృత్రిమ మేధ ల్యాబ్ భాషా, గణిత సామర్థ్యాల సాధన (ఎస్ఎల్ఎన్)పెంపుకు ఎంతగానో దోహదపడు తుందని సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. మంగళవారం ఆరెగూడలోని ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ(ఏఐ) ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ చదువులో వెనుకబడ్డ, బడి మానేసిన విద్యార్థుల కోసం ఏఐ సాయంతో బోధనలు ఎంతో ఉపయోపడుతాయన్నారు. కృత్రిమ మేధను విద్యారంగంలో అమలు చేయడం చాలా ఉపయోగకరమైన ఆలోచనని, ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా బోధన చేయాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది విద్యార్థులకు వారివారి స్థాయిలకు అనుగుణంగా సాధనతో పాటు విద్యా బోధన చేస్తుందని, ఒక్కొక్క కంప్యూటర్ పది మంది ఉపాధ్యాయులతో సమానమని, విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నా ప్రాథమికస్థాయిలో భాషలో అభ్యసనా సామర్యాలతో పాటు గణితంలో చతుర్విద ప్రక్రియల్లో వెనుకబాటులోనే ఉంటున్నారని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) సాయంతో ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానంగా 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో మెరుగైన అభ్యసన సామర్థ్యాలను సాధించడం జరుగుతుందని తెలిపారు. వారానికి నాలుగు రోజులపాటు నిర్వహించే ఏఐ బోధన ద్వారా విద్యార్థుల్లో అభ్యసన స్థాయిలు మెరుగుపడతాయన్నారు. అంతకు ముందు విద్యార్థులు చేస్తున్న సాదనలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, ఎంఈఓ వాసాల ప్రభాకర్, తహసీల్దార్ కిరణ్, ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు పర్మ చంద్రశేఖర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : కృత్రిమ మేధతో విద్యార్థులు అభ్యసన ఫలితాలు సాధించేందుకు దోహదపడుతాయని తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని చెడ్వాయి గ్రామంలో ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువులో వెనుకబడిన మూడు, నాలుగు, ఐదో తరగతి విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ ల్యాబ్‌ను మంగళవారం ఎంపీడీఓ అల్బర్ట్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో భాషా, గణితంలో అభ్యసన సాధన ఫలితాల్లో వెనుకబడిన విద్యార్థుల్లో కృత్రిమ మేద ద్వారా వారి అభ్యాసనను మెరుగుపరచవచ్చని, విద్యార్థులు ఈ ల్యాబ్‌ను ఉపయోగించుకొని ఫలితాలను మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో అభ్యాసన ఏ విధంగా జరుగుతుందో పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రమేష్‌బాబు, డీఈ భద్రయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, చందర్, గౌతమ్, ఆర్ఐ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి విజయశ్రీ, ఉపాధ్యాయులు రాకేష్, రాజకమలాకర్ రెడ్డి, గ్రామస్తులు శ్రీనివాస్, సత్తయ్య, వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్ : ల్యాబ్‌లో పాఠాలు వింటున్న విద్యార్థులు

ఒకే దేశం ఒకే ఎన్నికతో ఖర్చులు తగ్గుతాయి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఒకే దేశం ఒకే ఎన్నిక వల్ల ఎన్నికల ఖర్చులు తగ్గి ఎన్నికల కోసం అనేక దేశమంతా ఒకేసారి ఉండి పనులు సజావుగా చేసుకొనే వీలుంటుందని, దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థ కూడా పటిష్టంగా ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో బీజేపీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో సారి ఎన్నికలు ఉండటం వల్ల పరిపాలన సజావుగా సాగడంలేదన్నారు. ఈ విషయాన్ని అన్ని వర్గాల వారికి, మేధావులకు, ఉద్యోగులకు తెలియజేసి ఒకే దేశం ఒకే ఎన్నిక కోసం మద్దతు కూడగట్టాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కుకుడ రాజేష్, ఒకే దేశం ఒకే ఎన్నిక కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు, కోకన్వీనర్ వీరభద్రచారి, మండల కన్వీనర్ బొయిరె నానయ్య, జిల్లా కమిటీ మెంబర్ చపిడె సత్యనారాయణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దహెగాం : భారతదేశ అభివృద్ధి, పురోగతికి ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం అవసరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, ఒకే దేశం ఒకే ఎన్నిక జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే సమయంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎన్నికల వ్యయం, సమయం కలిసి వస్తుందన్నారు. దీంతో పాలనపై దృష్టి సారించవచ్చని తెలిపారు. కొన్ని ప్రాంతీయ పార్టీలు ఈ విధానంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారికి దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ, నియోజకవర్గ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్రచారి, నాయకులు, లగ్గామ దామోధర్, సుంకరి వెంకటేశం, లక్ష్మాజీ, సురేష్ పాల్గొన్నారు.

31లోగా దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

ఉద్యోగ విరమణ పొంది ఇప్పటి వరకు(సీపీఆర్ఎంఎస్) హెల్త్ కార్డు లేని విశ్రాంత ఉద్యోగులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.విజయ భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 31 తర్వాత దరఖాస్తుకు అవకాశం ఉండదన్నారు. విశ్రాంత ఉద్యోగులు నిర్ణీత గడువులోగా సంబందిత గనులు, విభాగాల్లో దరఖాస్తులు అందజేయాలని కోరారు. మూడు సెట్ల దరఖాస్తు ఫారాలు, ఉద్యోగితో పాటు జీవిత భాగస్వామి, నామినిల ఫోటోలు, ఆధార్ కార్డ్, పేరు తొలగింపు(మెమో) జిరాక్స్, జాయింట్ అకౌంట్ బ్యాంక్ బుక్ జిరాక్స్, రూ.60 వేలను ఎస్‌బీఐకలెక్టర్‌లో చెల్లించి రసీదు తీసుకోవాలని, కుటుంబంలో వికలాంగులు ఉంటే ఒక్కరికి రూ.20 వేలు చెల్లించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ గ్రామీణ ప్రాంతంలోని చిర్రకుంట 11 కెవి విద్యుత్ లైన్ మరమ్మతుల్లో భాగంగా నేడు మండలంలోని చిర్రకుంట, మాలనుగొంది, కొసార, భవాని నగర్, పాడిబండ గ్రామపంచాయతీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆసిఫాబాద్ గ్రామీణ విద్యుత్ శాఖ ఏఈ ఊర్మిళ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

నేడు వార సంతకు వేలం పాట

నవతెలంగాణ-జైనూర్

జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ వార సంత వేలంపాటను బుధవారం నిర్వహిస్తున్నట్లు ఈఓ ఆనంద్ రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025- 26 సంవత్సరానికి వారసంత కోసం వేలంపాటని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేలం పాట కోసం ఆ అసక్తి గల వారు ఉదయం 10 గంటల నుండి జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయానికి రావాలని తెలిపారు. నిబంధనల ప్రకారం సంవత్సరమంతా మండల కేంద్రంలో ఉన్న వారసంతకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

'యాజమాన్య పద్ధతులు పాటించాలి'

నవతెలంగాణ-జన్నారం



పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం జన్నారంలోని రైతు వేదికలో పలు గ్రామాల రైతులకు వివిధ పంటల సాగు-యాజమాన్య పద్ధతుల'పై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ అనిత, మండల ఏఓ సంగీత, ఏఈఓలు త్రిసంధ్య, దివ్య, సాయి, లవన్, అక్రమ్ పాల్గొన్నారు.

సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జైపూర్

వ్యవసాయ యాత్రికరణలో భాగంగా సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ తెలిపారు. ఆసక్తిగల మహిళా రైతులకు ఎస్ఎంఏఎం పథకం ద్వారా రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా అర్హులైన వారికి అందజేయడం జరుగుతుందని అన్నారు. కాగా మండల పరిధిలో గల మహిళా రైతులకు సంబంధించి బ్యాటరీ స్ప్రేయర్స్-5, పవర్ స్ప్రేయర్స్-5, రోటివేటర్స్-3 కల్టివేటర్, కేజీవీల్స్-3 శాఖ పరంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల మహిళా రైతులు ధరఖాస్తుతో పాటు భూమి పాస్ బుక్, ఆధార్‌కార్డు, ట్రాక్టర్ ఆర్సీ జిరాక్స్ కాపీలతో స్థానిక రైతు వేదికలో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 26 వరకు ధరఖాస్తులు ఆహ్వానిస్తుండగా మండల పరిధిలో గల మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సత్ఫలితాలిస్తున్న భూ వివాదాల పరిష్కార వేదిక

నవతెలంగాణ-తాండూర్

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రతి సోమవారం మండల, డివిజన్, జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న భూ వివాదాల పరిష్కార వేదిక బెల్లపల్లి డివిజన్‌లో సత్ఫలితాలిస్తోంది. కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు ఆర్డీఓ హరికృష్ణ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. డివిజన్ పరిధిలోని ఆయా మండలాల తహసీల్దార్‌లను పురమాయించి క్షేత్ర స్థాయిలో భూ సమస్యలను పరిష్కరిస్తూన్నారు. అంతే కాకుండా ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములపై దృష్టి సారిస్తున్నారు. గత మూడు వారాల్లో బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో భూ సమస్యలు పరిష్కారం అవ్వడంతో అర్జీదారుల్లో రెవెన్యూ శాఖపై సదాభిప్రాయం ఏర్పడుతోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బెల్లంపల్లి డివజన్ పరిధిలో తాండూర్ మండలం భూ వివాదాల పరిష్కారంలో ముందజలో ఉంది. 14 దరఖాస్తులకు గాను ఏడు దరఖాస్తులు పరిష్కరించి తాండూరు మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో బెల్లంపల్లి మండలం ఉంది. ఇప్పటివరకు డివిజన్‌లోని ఏడు మండలాల్లో 34 అర్జీలు దాకలవ్వగా అందులో 18 సమస్యలు పరిష్కారం అయ్యాయి. 12 సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. నాలుగు సమస్యలు సబ్‌డివిజన్ స్థాయి కమిటీ పర్యవేక్షణలో ఉన్నాయి.

పరిష్కారమైన భూ వివాదాలు

పేదలకు అసైన్డ్ చేసిన భూమిని కొనుగోలుదారుల వద్ద నుండి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాండూరు శివారులోని సర్వే నంబర్ 669/1లోని 1.20 విస్తీర్ణంలో గల భూమిని ప్రభుత్వం 2007లో కాదసి విమల పేరున అసైన్మెంట్ పట్టా ఇచ్చింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. అట్టి భూమిని విమల నుంచి అసైన్డ్ నిబంధనలకు విరుద్ధంగా శోభ కొనుగోలు చేయగా 2018లో పట్టా పాస్‌బుక్కులు మంజురయ్యాయి.

● అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్న అధికారులు ● క్షేత్ర స్థాయిలో పరిష్కారమవుతున్న సమస్యలు



క్షేత్రస్థాయిలో భూ సమస్యను పరిశీలిస్తున్న తాండూర్ తహసీల్దార్, పోలీసు అధికారులు (ఫైల్)

ఫిర్యాదుదారులు కేదాసి విమల కుమార్తెలు కేదాసి అభిలా తాము ప్రభుత్వం ఇచ్చిన భూమిని అమ్మలేదని యాంగరు శోభా మోసం చేసి పట్టా మార్పు చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొంది. అసైన్మెంట్ రూల్స్ ఉల్లాంఘున ప్రకారం శాంతి భద్రతల దృశ్య అసైన్డ్ చేసిన భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట

తన ఇంటిని అక్రమంగా ఆక్రమించుకునేందుకు సుమన్ అనే వ్యక్తి ప్రయత్నిస్తున్నారని బెల్లంపల్లి మండలం పెరికపల్లి గ్రామానికి చెందిన బాకం సత్తెమ్మ భూ సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ జోత్స్న పోలీస్ అధికారులతో బాధితురాలి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించి సమస్యను సామరాస్యంగా పరిష్కరించారు.

సద్దు మనిగిన కుటుంబ వివాధం

కుటుంబంలో భూమి పంపకాల వివాదంతో ఓ కన్నతల్లికి అధికారులు న్యాయం చేశారు. గంపలపల్లి గ్రామానికి చెందిన బర్ల సుగుణ భూ సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. స్పందించిన రెవెన్యూ అధికారులు గురువారం వివాదాన్ని పరిష్కరించారు. తాండూర్ మండలంలోని గంపలపల్లి గ్రామ శివారులో సర్వే నెంబర్ 18లో బర్ల సుగుణ పేరున మొత్తం విస్తీర్ణం 8.19 గల భూమి కలిగి ఉంది. సగం వాట చిన్న కుమారుని పేరిట పట్టా మార్పు జరుగగా మిగతా 4.10లో తల్లి బర్ల సుగుణ పేరిట పట్టా ఉంది. ఇద్దరు కుమారుల సమానంగా పంచాలని గొడవ పడి తల్లి బాగోగు చూసుకోవడం లేదని ఫిర్యాదు చేసింది. దీంతో అధికారులు స్పందించారు.

అసైన్డ్ భూముల స్వాధీనం..

తాండూరు మండలంలో అసైన్డ్ భూ వివాదానికి సంబంధించి రెండు దరఖాస్తులను పరిష్కరించిన అధికారులు 4.20 గుంటల భూమి భూమిని స్వాధీనం చేసుకున్నారు. బెల్లంపల్లి మండలంలో అసైన్డ్ భూములకు సంబంధించి నాలుగు దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తహసీల్దార్ జ్యోత్స్న భూదాకలన్ 170 సర్వే నెంబర్‌లో భూమిని స్వాధీనం చేసుకున్నారు.

అసైన్డ్ భూముల వివాదాల్లో ప్రత్యేక శ్రద్ధ

ఇమ్రాన్ ఖాన్, తహసీల్దార్, తాండూర్



పేదలకు వ్యవసాయం చేసుకోవడానికి అసైన్డ్ చేసిన భూవివాదాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. నిబంధనలు అతిక్రమించి పేదలను మభ్యపెట్టి భూమిని ఆక్రమించుకున్న వారి భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నాం. మండల స్థాయిలో పరిష్కారం కాని కేసులను డివిజన్ స్థాయి అధికారులకు పంపించాం. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో బాధితులు దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరుగుతుంది.

మత్స్యకార సొసైటీకి రూ.10లక్షలు అందించాలి



నవతెలంగాణ-మంచిర్యాల

రాష్ట్రంలోని ప్రతి మత్స్యకారుల సొసైటీ నిర్వహణకు రూ.10 లక్షల నగదు అందించాలని తెలంగాణ మత్సకారుల సంఘం జిల్లా కార్యదర్శి బోడెంకి చందు డిమాండ్ చేశారు. మంగళవారం నెన్నెల మండలంలోని ఆవడం గ్రామంలో నిర్వహకించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారులకు చాప పిల్లలకు బదులుగా సొసైటీ అకౌంట్లు నగదు బదిలీ చేయాలని తద్వారా నాణ్యమైన చాప పిల్లలు మత్స్యకారులు కొనుగోలు చేస్తారని, ఉచిత చాప పిల్లల పథకాల ద్వారా చెప పిల్లల కాంట్రాక్టర్లు అభివృద్ధి అయ్యారు తప్ప మత్స్యకారుల అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్ ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, చెరువులు కుంటలు కబ్జాల నుంచి కాపాడాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మత్స్యకారులకు ప్రాతినిధ్యం ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు రూ.5000 పింఛన్ అందించి, చెరువులు కుంటలు ఎండిపోయిన సొసైటీకి మచ్చ భరోసా కింద ప్రతి ఒక్కరికి నెలకు రూ.15 వేలు ఇచ్చి మత్స్యకారుల అభివద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుమ్ముల ఆశన్న, మంచర్ల రాజేందర్, తోకల సంతోష్, మాచర్ల వెంకటేష్, చంద్రశేఖర్, తోకల మల్లేష్, భీమన్న, మధు, కిరణ్, నరేష్, వినయ్ పాల్గొన్నారు

యూనివర్సిటీల రాష్ట్రస్థాయి సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

యూనివర్సిటీల రాష్ట్రస్థాయి సదస్సుల పోస్టర్‌ని పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాకల విద్యార్థినీలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ప్రభంజనం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలపై కేంద్ర ప్రభుత్వ పెత్తనం ఎందుకని ప్రశ్నించారు. గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని వీసీ నియామకాల్లో జోక్యం చేసుకోవడం అంటే రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని కాలరాయడమే అవుతుంది అని తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం(2020) పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని వీసీ నియామకాల్లో జోక్యం చేసుకోవడం స్వయంప్రతిపత్తిని కాలరాయడమే అవుతుంది అని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వీఓఏలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



నవతెలంగాణ-జైపూర్

ఐకేపీ వీఓఏలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని జైపూర్ ఐకేపీ వీఓఏల సంఘం నాయకులు రమేష్, లింగన్న, పద్మ, వినోద, కొమురయ్య, గట్టయ్యలు అన్నారు. సీఐటయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గల సెర్ప్ కార్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యాక్రమానికి వెల్లకుండా స్థానిక ఐకేపీ వీఓఏలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఐకేపీ వీఓఏలకు రూ.20 వేల జీతంతో పాటు ఉద్యోగభద్రత, ఇన్సూరెన్స్, డ్రెస్ కోడ్ అమల్లోకి తెస్తామని చెప్పి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం చేస్తుందని ఆవేధన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఐకేపీ వీఓఏలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు. శాంతియుతంగా తమ డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడానికి వెళ్తుంటే పోలీసులతో ముందస్తు అరెస్ట్ చేయించడం సరికాదని అన్నారు.

ఆశా వర్కర్లపై లాఠీ చార్జీకి నిరసన

నవతెలంగాణ-తాండూర్

ఆశ వర్కర్లపై పోలీసుల దాడికి నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు మంగళవారం బెల్లంపల్లి అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు హక్కుల కోసం పోరాడుతున్న ఆశా కార్యకర్తలను ముందస్తు అరెస్టులు లాఠీచార్జీలు చేయడం సరికాదని సీఐటీయూ నాయకులు అన్నారి దేవదాస్ తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు రాణి, ఎం భాగ్యలక్ష్మి, కే రేణుక, డి సంధ్య, ఎం రాజేశ్వరి, జి రేణుక, లావణ్య, నసీమా, ధనలక్ష్మి, లత, సుజాత, అరుణ, మాణిక్యం, పరమేశ్వరి, స్రవంతి, స్వరూప, భారతి, గంగరాణి, రజియా ,స్వరూప రాణి, సరిత, శ్యామల పాల్గొన్నారు



తాండూర్ : బెల్లంపల్లి అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఆశాలు



లక్షెట్టిపేట : ఉత్కూర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఆశాలు

లక్షెట్టిపేట : ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో లక్షట్టిపేట మండల కేంద్రంలోని ఊత్కూరు చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ నిన్న హైదరాబాద్‌లో ఆశాలపై రాష్ట్ర ప్రభుత్వం చేయించిన లాఠీచార్జి, దాడి చాలా దుర్మార్గం.ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం తమకు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎఎన్ఎం ట్రైనింగ్ చేసిన ఆశాలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

సిటిజన్ లాగిన్ ద్వారా ఎల్ఆర్ఎస్ స్టేటస్

● ఎంపీడీఓ సత్యనారాయణ

నవతెలంగాణ-జైపూర్



ఎల్ఆర్ఎస్-2020 ద్వారా ఇంటి స్థలాన్ని ఆన్‌లైన్ చేసుకోవడం కోసం ధరఖాస్తు చేసుకున్న వారు నేరుగా సిటీజన్ లాగిన్ ద్వారా ధరఖాస్తుల స్టేటస్ తెల్సుకోవచ్చునని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. స్థానిక ఎంపీఓ శ్రీపతి బాపురావుతో కలిసి మంగళవారం మండల పరిధి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన ధరఖాస్తుదారులు తమ ధరఖాస్తుల స్థితిగతులను వారి మొబైల్ ఫోన్ ద్వార తెల్సుకునే విధంగా అవగాహణ కల్పించాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ (లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం-2020 ద్వార ధరఖాస్తుదారులకు స్వయంగా మొబైల్ ద్వారా సమాచారం చేరవేసి వారికి గల సందేహాలను నివృత్తి చేయడం జరిగిందని అన్నారు. ఈ నెల 31 వరకు ధరఖాస్తు రుసుము చెల్లించిన వారికి 25 శాతం రాయితి వర్తిస్తుందని, ఈ విషయమై మండల పరిధిలో గల ఎల్ఆర్ఎస్ ధరఖాస్తుదారులకు స్వయంగా సమాచారం అందించాలని తెలిపారు. ఈ పథకం ద్వార లేఔట్లు క్రమబద్ధీకరించుకోవడం కోసం ధరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరు ప్రభుత్వం ప్రకటించిన రాయితీ 25 శాతం సద్వినియోగం చేసుకునేందుకు గ్రామ పంచాయతీ ద్వార సహకరించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు.

కూలి గిట్టుబాటవ్వాలి

● ఎంపీడీఓ సత్యనారాయణ



నవతెలంగాణ-జైపూర్

గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనులకు వస్తున్న కాలీలకు రోజు వారి కూలి గిట్టుబాటు అయ్యేవిధంగా పనుల కొనసాగాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. మండలంలోని కిష్టాపూర్, కుందారం గ్రామ పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించిన ఆయన వేసవి ఎండలు ముదురుతున్నందున పనుల నిర్వాహణలో సమయపాలన పాటించాలని కోరారు. భూముల చదును, పిచ్చి మొక్కల తొలగింపు, సీసీ రోడ్డు నిర్మాణాలు, పాఠశాల ప్రహరి గోడ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలల్లో నర్సరీలను సంధర్శించి నూటికి నూరు శాతం జర్మనేషన్ వచ్చే విధంగా చూడాలని, వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని మొక్కలకు ఎప్పటికప్పుడు నీరందించాలని తెలిపారు. కాగా ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న వారు ప్రభుత్వం ప్రకటించిన కూలీ గిట్టుబాటు చేసుకోవాలని సూచించిన ఆయన నిర్ణీత కొలతలతో పనులు పూర్తి చేయాలని అన్నారు. రోజు వారి హాజరు శాతం చూపించడంతో పాటు కూలీ రేట్లపై ప్రతి ఒక్కరికి అవగాహణ కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసేవారికి తప్పక గుర్తింపు

● రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ

● గంజాయి కేసు ఛేదించి పోలీలకు రివార్డులు

నవతెలంగాణ-జైపూర్



రివార్డు అందజేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

విధుల పట్ల నిబద్ధతతో పని చేసే అధికారులకు తప్పక గుర్తింపు లభిస్తుందని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. మంచిర్యాల, గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్, డివిజనల్, జోన్ల వారిగా పెండింగ్ కేసులు, సంబంధిచిన నేరస్థులు, అరెస్టులు, దర్యాప్తులు, సాక్ష్యాధారల సేకరణ, చార్జీ షీట్లకు సంబంధించి స్థితిగతులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కమీషనరేట్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, ఫోక్సో కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులపై ఆరా తీశారు. ఈ సంధర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగే ప్రతి కార్యకలాపాలపైన ముందస్తు సమాచారం కలిగివుండటంతో పాటు ప్రతి కేసులో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులలో న్యాయపరంగా పారదర్శకంగా విచారణ జరుపాలని, ప్రతి పోలీస్‌స్టేసన్‌లో అధికారులకు సిబ్బందికి స్టేషన్ పరిధిలో అన్ని రకాలైన సమచారం కలిగివుండాలని తెలిపారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. దొంగతనాలు జరుగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, ప్రధాన చోరీలకు పాల్పడిన నేరస్థులను గుర్తించడంతో పాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో విలేజ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని, కింది స్థాయి సిబ్బందితో మర్యాదగా ఎలాంటి బేదాలు లేకుండా ప్రవర్తించాలని పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా గంజాయి స్వాధీనం కేసులలో ప్రతిభ కనబర్చిన అధికారులకు సిబ్బందికి సీపీ రివార్డులు అందజేశారు.

పాఠశాలకు బీరువాలు, బెంచీలు అందజేత

నవతెలంగాణ-లక్షెట్టిపేట

చదువుకున్న పాఠశాలను మరిచిపోకుండా పూర్వ విద్యార్థి పాఠశాల అభివృద్ధికి చేయూతనందించాలని ముందుకు వచ్చారు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన కొత్త కిషోర్ కుమార్ (సాఫ్ట్వేర్ ఇంజనీరు) తను చదువుకున్న పాఠశాలకు రెండు బీరువాలు, ఐదు క్లాసు రూమ్ టేబుల్స్, ఆఫీస్ టేబుల్స్, గ్రీన్ బోర్డ్స్, తాత వోజ్జల చంద్రమౌళి జ్ఞాపకార్థం బహుకరించినారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ సునంద, ఉపాధ్యాయ బృందం రవీందర్, వసంత, సుజాత, బి మాయ, ఎస్ స్వప్న, ఎస్ రామ్మోహన్‌రెడ్డి, పి సరిత, కె సంపూర్ణ, వారికి కృతజ్ఞతలు తెలిపారు.



మరోసారి సత్తా చాటిన రాఘవేంద్ర లిటిల్ హన్స్

నవతెలంగాణ-జన్నారం



6వ తరగతి నవోదయ ప్రవేశ పరీక్షలో మండలంలోని రాఘవేంద్ర లిటిల్ హన్స్ పాఠశాల విద్యార్థి సత్తా చాటారు. మండలంలోని మొర్రిగూడకు చెందిన విద్యార్థి ఆర్.శివప్రసాద్ నవోదయ ప్రవేశ పరీక్షలో సీటు సాధించాడు. నవోదయ సీట్ సాధించిన విద్యార్థి శివప్రసాద్‌ను పాఠశాల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, డీన్ హేమలత షిండే, ప్రిన్సిపల్ ఏ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలి



నవతెలంగాణ-నస్పూర్

ఉద్యోగులు హాజరు శాతాన్ని మెరుగు పరుచుకొని సంస్థ అభివృద్ధికి తొడ్పడాలని ఇన్‌చార్జి జీఎం రాజేందర్ అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకె-1ఏ, ఐకె ఓసీ, ఏరియా వర్క్ షాప్, ఏరియా స్టోర్స్, టింబర్ యార్డ్‌లలో గైర్హాజరు ఉద్యోగులకు ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ రాజేందర్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకె-1ఏ, ఐకే ఓసీ, ఏరియా వర్క్ షాప్, ఏరియా స్టోర్స్, టింబర్ యార్డ్‌లలో పనిచేస్తూన్న ఉద్యోగులు 2024 సంవత్సరంలో కనీసం 100 మస్టర్లు చేయని ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇప్పటి నుండి తప్పని సరిగా ప్రతినెల 20 మస్టర్లు చేయాలని సంస్థలో ఉద్యోగం దొరకడం మీ అందరి అదృష్టమని, ఉద్యోగులందరూ హాజరు శాతాన్ని పెంచుకోవాలని కోరారు. సింగరేణి సంస్థ చాల సదుపాయాలు అందిస్తుందని ప్రతి ఒక్కరు దానిని దృష్టిలో ఉంచుకొని విధులకు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ రోజు కౌన్సిలింగ్‌కు 27 మంది గైర్హాజరు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, డీవై సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, డీవైపీఎం రాజేష్, సంక్షేమ అధికారులు అజ్మీర రమేష్, రామ చారి, సీనియర్ అసిస్టెంట్ ఆకుల అఖిల పాల్గొన్నారు.

ఆటోమెటిక్ సీసీ కెమెరాలు బిగించడం అభినందనీయం

నవతెలంగాణ-జైపూర్



ఇందారం-పౌనూర్ ప్రధాన కూడలిలో ఆటోమెటిక్ సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. ఎస్సై శ్రీధర్‌తో కలిసి మంగళవారం సీసీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. సీసీ కెమెరాల నిరంతర నిఘా ద్వారా నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు. అసాంఘిక కార్య కలాపాలు, రోడ్డు ప్రమాదాలు, మద్యం, గంజా తాగడుకు కేంద్రంగా కొనసాగుతున్న ఏరియాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమన్నారు. రామారావుపేట్, ఇందారం గ్రామాలకు చెందిన పలువురు సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు వచ్చినందుకు అభినందించారు. గతంలో ఇదే ప్రదేశంలో జరిగిన అసాంఘిక, నేర ప్రవృత్తి గల అనేక సందర్భాలను ఏసీపీ గుర్తు చేశారు.

భారీగా కలప పట్టివేత

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల అటవీ రేంజీ పరిధిలోని హీరాపూర్, కేటీఆర్ అటవీ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన కలపను అటవీ అధికారులు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టుకున్నారు. కేటీఆర్ ఎఫ్‌డీఓ రేవంత్ చందర్ ఆధ్వర్యంలో అటవీ శాఖ అధికారులు ఆ గ్రామంలో నిఘా పెట్టి అక్రమ కలపను పట్టుకున్నారు. పట్టుకున్న కలప విలువ రూ. 2 లక్షల వరకు ఉంటుందని ఈ మేరకు కేసు నమోదు చేసి కలపను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.



గేదెను ఢీ కొట్టిన బైక్..
ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-బెజ్జూర్



ద్విచక్రవాహనంతో బర్రెను ఢీకొట్టిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. మంగళవారం మండల కేంద్రానికి సమీపంలోని నాగులమ్మ వద్ద బర్రెను బైక్ ఢీకొనడంతో సోమిని గ్రామానికి చెందిన మడే భీంరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ భీంరావును 108లో ఆస్పత్రికి తరలించారు.

జిల్లా అధికారులకు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలో ఈనెల 23న నిర్వహించే అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు నవజ్యోతి సాంస్కృతిక సంస్థ చైర్మన్ సురేష్ కుమార్ జిల్లా అధికారులను సన్మానించారు. జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి సంపత్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుమురం భీం జాతీయ అవార్డు పురస్కార కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారుల పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. కార్యక్రమంలో సభ్యుడు రాధాకృష్ణ చారి పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి
సహకరించండి

నవతెలంగాణ-నార్నూర్



వెనుకబడిన ఆదివాసీ ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ కోరారు. మంగళవారం మండల పర్యటనకు వచ్చిన నీతి అయోగ్ జాతీయ బందానికి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వినతి ప్రతం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల, సాంఘిక సంక్షేమ, మైనారిటీ జూనియర్ కళాశాలల ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సాగునీటి కోసం ఏంపల్లి, కొలాందరి ప్రాజెక్టులు నిర్మించాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులను నియమించి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని విన్నవించారు. బంద సభ్యులు సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పరిష్కరానికి కృషి చేస్తామన్నారు. జాతీయ బృందంలో డైరెక్టర్ మృత్యుంజయ ఝా, డెప్యూటీ సెక్రెటరీ సుబోత్ కుమార్, వారి వెంట కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్ ఉన్నారు. వినతి పత్రం అందించిన వారిలో జేపీసీ మాజీ చైర్మన్ ఉత్తం రాథోడ్, మాజీ జడ్పీటీసీ బ్రీజులాల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ దాదే అలీ, బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, ఫ్యాక్స్ ఇంచార్జ్ చైర్మన్ సురేష్, డైరెక్టర్ కాంతారావు దుర్గే, మాజీ ఎంపీటీసీలు కోలట్కర్ పరమేశ్వర్, షేక్ నసీర్ ఉన్నారు.

ఆర్థిక భారం తగ్గుతుంది

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం తగ్గుతుందని నిర్మల్ జిల్లా బీజేపీ కార్యదర్శి శ్రావణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సోన్ మండల కేంద్రంలో ఒకే దేశం ఒకే ఎన్నిక కార్యశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తరచుగా జరిగే ఎన్నికలు అనిశ్చితి వాతావరణాన్ని సృష్టిస్తాయని, ఇవి విధాన నిర్ణయాలను ప్రభావితం చేస్తాయని అన్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సోన్ మండల బీజేపీ అధ్యక్షులు మార గంగారెడ్డి, కన్వీనర్ సందుగారి నవీన్, కోకన్వీనర్ పెసరి గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు డా.నరేష్, మండల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న ధర్నా

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



అటవీ హక్కుల చట్టాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వం పేదలను ఇబ్బంది పెట్టవద్దని చెబుతూ ఉంటే ఖానాపూర్ ఫారెస్ట్ అధికారులు ఒక పేద గుడిసెను తొలగించడం ఏమిటని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నిర్మల్ జిల్లా కార్యదర్శి జే.రాజు ప్రశ్నించారు. కలెక్టరేట్ ఎదుట గోనే స్వామి బాధితుడు చేస్తున్న ధర్నాలో మంగళవారం పాల్గొని మాట్లాడారు. 2005 అటవీ హక్కుల చట్టాన్ని కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. దేశవ్యాప్తంగా అటవీ భూములు సాగు చేస్తున్న పేద ప్రజలందరికీ హక్కులు కల్పించామని అన్నారు. పేద ప్రజల జోలికి వెళ్లొద్దని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చెబుతుంటే స్థానిక ఫారెస్ట్ అధికారులు మాత్రం పేద ప్రజలపై గుడిసెలు కూల్చడం ఎంతవరకు సమజసం అన్నారు. కార్యక్రమంలో బాధితులు గోనె స్వామి, గోనె మల్లీశ్వరి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సునారికారి రాజేష్, జిల్లా నాయకులు గోపి నర్సయ్య, డివిజన్ నాయకులు దుర్గం లింగన్న, గూట్ల ప్రసాద్, శేఖర్, శంకర్, రాములు పాల్గొన్నారు.

నవోదయలో విద్యార్థుల ప్రతిభ

నార్నూర్ : మండలంలోని తాడిహత్నూర్‌కు చెందిన జాదవ్ అతిథిఅంజలి, జాదవ్ వర్ధిని నవోదయలో ప్రతిభను చాటారు. ఆరో తరగతికి సీటు సాధించారు. వేర్వేరు ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుకుంటూ సీటు దక్కించుకున్నారు. దీంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్‌ల పరీక్ష ఫీజు చెల్లింపు గడువును పొడిగిస్తున్నట్లు కేయూ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారంతో గడువు ముగియగా ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 2వ తారీఖు వరకు గడువు పొడగించినట్లు పేర్కొన్నారు. కాగా రూ.50 అపరాధ రుసుముతో ఏప్రిల్ 9వ వరకు చెల్లించవచ్చని, పరీక్షలు ఏప్రిల్ నెలలో ఉంటాయని, ఉమ్మడి జిల్లా డిగ్రీ విద్యార్థులు గమనించాలని పేర్కొన్నారు.

సీసీఐ పున:ప్రారంభానికి సంఘటిత పోరాటాలు

- 28న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాక
- పట్టణంలో 200 బైక్‌లతో ర్యాలీ
- ఏప్రిల్ 1న ఛలో ఢిల్లీ



సమావేశంలో మాట్లాడుతున్నసీసీఐ సాధన కమిటీ సభ్యులు, ఆయా పార్టీల నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ సీసీఐ సాధన కమిటీ సమావేశాన్ని మంగళవారం సాయంత్రం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించారు. భాగస్వామ్య పక్షాలతో పాటు మాజీమంత్రి జోగురామన్న పాల్గొని పలు తీర్మానాలు చేసి కార్యాచరణ ప్రకటించారు. మార్చి 28న సీసీఐ పోరాటానికి మద్దతు ఇవ్వడానికి వస్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పర్యటనను జయప్రదం చేయాలన్నారు. దీనికోసం వెయ్యి మందిని సమీకరించాలని, 200 బైక్‌లతో ర్యాలీ నిర్వహించాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 1న చలో ఢిల్లీ నిర్వహించాల తీర్మాణించారు. 100 మంది జంతర్ మంతర్ దగ్గర ధర్నాలో పాల్గొనాలని పేర్కొన్నారు. ఉద్యోగ, విద్యార్థి, కార్మిక సంఘాల నాయకులను కలవాలన్నారు. ఉద్యమ ఫొటో ఫ్లెక్సీలు పెట్టాలని ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు సీసీఐ సాధన పోరాట కమిటీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. కాగా ఈనెల 28న ఉదయం 9 గంటల నుంచి 10:30 వరకు జాన్‌వెస్లీ సీసీఐ పరిశ్రమ పరిశీలన ఉంటుందని, ఉదయం 10:30 నుంచి సీసీఐ నుండీ బైక్ ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఉదయం 11:30 బహిరంగ సభ నిర్వహించేలా ప్రణాళికలు చేశామని తెలిపారు. పరిశ్రమ ప్రారంభించే వరకు ఉద్యమిస్తునే ఉంటామన్నారు. కేంద్రం దిగి వచ్చి ఫ్యాక్టరీని పున:ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కన్వీనర్ దర్శనాల మల్లేష్, కో కన్వీనర్ విజ్జగిరి నారాయణ, కొండ రమేష్, నల్ల గణపతి రెడ్డి, లోకారి పోశెట్టి, రత్నపురం రమేష్, అగ్గిమల్ల గణేష్, సందీప్, బమాస్ జగన్, గణేష్ పేర్కొన్నారు.

రుణాల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో స్త్రీ నిధి రుణాల వసూలు పై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం డీఆర్డీఓ దత్తరావుతో కలిసి సహాయ ప్రాజెక్టు మేనేజర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ నిధి రుణాల వసూలు సమర్థవంతంగా నిర్వహించాలని, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సాధికారత కల్పించే లక్ష్యంతో అందించిన రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 28 తుది గడువని, రుణాల వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రుణ గ్రహీతలను నేరుగా సంప్రదించి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నారు. నిర్దేశిత గడువులోగా 100 శాతం వసూలు పూర్తి చేయాలని సూచించారు. ఇందులో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, రిసోర్స్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గడువులోగా స్త్రీనిధి రుణాలు వసూలు చేయాలి

నిర్మల్ : నిర్ణీత గడువులోగా స్త్రీనిధి రుణ బకాయిల వసూలు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్త్రీనిధి రుణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా మహిళా సంఘాల సంఖ్య, మంజూరు చేసిన రుణాలు, ఇప్పటివరకు సంఘాలు చెల్లించిన బకాయిలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వసూలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందులో ఇన్‌చార్జి డీఆర్డీఓ శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, స్త్రీనిధి, ప్రాంతీయ సమన్వయకర్త సరిత, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : స్త్రీ నిధి రుణాలపై అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆదివాసులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించివ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మావల మండలంలోని కొమురం భీం కాలనీని మంత్రి సీతక్క సందర్శించి ఇక్కడి ఆదివాసులకు ఇండ్ల పట్టాలను మంజూరు చేసి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించివ్వాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న ఆదివాసులకు మంగళవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్లుగా పోరాటం చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ప్రభుత్వ భూములన్నీ పేదలవేనని ఐఏఎస్ శంకరన్ సూక్తులను గుర్తు చేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, విద్యుత్ సరఫరా నిలిపివేసి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్, సీఎంకు ఉత్తరాల ద్వారా, మంత్రి సీతక్క దష్టికి నేరుగా సమస్యను తీసుకెళ్లినప్పటికీ స్పందించకపోవడం ఆదివాసీలపై నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. కాలనీని సందర్శిస్తానని సీతక్క హామీ ఇవ్వగా స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం శోచనీయమన్నారు. ఈ ఇందులో తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, కార్యదర్శి పులి కల్పన, వివిధ సంఘాల నాయకులు వినోద్, అభిషేక్, వేణు, వికాస్, ఉయిక ఇంద్ర, సోయం లలితా, ఆత్రం భుజంగరావు, ఆత్రం గణపతి, సలాం వరుణ్, వెడ్మ ముకుంద్, వెట్టి మనోజ్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి

కనీస సౌకర్యాలకు ఆమడ
దూరంలో ఆదివాసీ కాలనీ



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మండలం బావురావుపేట్ ఆదివాసీ కాలనీవాసులు కనీస సౌకర్యాలకు ఆమడ దూరంలో ఉన్నారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోడంకి చందు అన్నారు. మంగళవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బావురావుపేట్ కాలనీలో చేపట్టిన సర్వేలో వెలుగు చూసింది. కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు సీపీఐ(ఎం) గుర్తించిందని తెలిపారు. రోడ్లు నిర్మించకపోగా కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వ పెద్దలు నిర్లక్ష్యం చేస్తున్నట్లు కాలనీవాసులు ఆవేధన వ్యక్తం చేశారు. గొంతు తడుపుకోవడం కోసం వ్యవసాయ బోరుబావులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో కనీసం నీటి సమస్యను పరిష్కరించలేకపోతుందని విమ్మర్శించారు. కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు సామల ఉమారాణి, సిడ్డం సమ్మక్క, రమాదేవి, భూదక్క, శంకరక్క కాలనీవాసులు పాల్గొన్నారు.

మహిళా రైతులు దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎంఏఎమ్ పథకం కింద వివిధ రకాల పరికరాల కోసం మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 50 శాతం రాయితీపై పరికరాలు అందించడం తెలిపారు. ట్రాక్టర్‌తో నడిచే పరికరాలకు తప్పకుండా మహిళా రైతు పేరు మీద ట్రాక్టర్ ఉండాలని పట్టాపాసు బుక్ కలిగి ఉండాలి లేనియెడల భర్త అయిన కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. మీకు ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని గాని వ్యవసాయ అధికారిని సంప్రదించాలన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనకు ఆర్థిక తోడ్పాటు

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం భూర్గుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవంతో పాటు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి పోలంపల్లి మాజీ సర్పంచ్ దర్శనాల రమేష్ ఆర్థిక తోడ్పాటు అందిచారు. సేవాలాల్ దీక్షాపరులైన పలువురు మంగళవారం పోలంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ దర్శనాల రమేష్‌ను కలిసి విగ్రహ ప్రతిష్టకు ఆర్థికంగా సహాయపడాలని కోరిన వెంటనే ఆయన తన వంతుగా రూ.50,116 విరాళం ప్రకటించినట్లు తెలిపారు. .

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని లఖంపూర్ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హెచ్‌బీ టెస్టులు నిర్వహించి, తగు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సంతోష్ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి ఇబ్బందులు వచ్చిన అందుబాటులో ఉన్న వైద్యులను సంప్రదించాలని అన్నారు. అంతేకాకుండా తినుబండారాల విధానంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అశోక్, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, నరేందర్‌రెడ్డి, హాస్టల్ జీఎస్ఎం కావేరి, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం పర్యటన

నవతెలంగాణ-ఆదిలాబాటౌన్

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బందం జిల్లాలో పర్యటిస్తున్నట్లు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27 గుడిహత్నూర్‌లో అంబేద్కర్, కొమురం భీం విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పిస్తారని, అనంతరం అత్యాచారానికి గురైన దళిత మైనర్‌బాలిక కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. తర్వాత జిల్లా కలెక్టరెట్‌లో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాలు, భూ సమస్యలపై ఉన్నతాధికారులతో సమీక్షించి దళిత, గిరిజన, ఆదివాసీ సంఘాల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారన్నారు. డీసీసీ బ్యాంకులో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు పై చర్చిస్తారని, మావల కొమురం భీం కాలనీలో ఇండ్ల స్థలాల కోసం పోరాడుతున్న ఆదివాసులను కలుస్తారని వివరించారు. రాత్రి గుడిహత్నూర్ మండల చిన్న మాల్కాపూర్ గ్రామంలో గిరిజనుల సాంస్కృతిక కళారూపాలను తిలకిస్తారని వెల్లడించారు. 28న ఆసిఫాబాద్, మంచిర్యాల కలెక్టరెట్‌లలో అట్రాసిటీ, భూ సమస్యల పై సమీక్షించి బాధితుల నుండి వినతిపత్రాలను స్వీకరిస్తారని తెలిపారు. 29న సింగరేణి ఉద్యోగులతో సమావేశమవుతారని వివరించారు. ఇందులో ఆదివాసీ నాయకులు లక్ష్మణ్, డీబీఎఫ్ నాయకులు పులి కల్పన, రాజేందర్, వేణు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి
రూ.8 లక్షల భద్రతా చెక్కు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత సంవత్సరం తాంసి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఎం.గంగన్న కుటుంబానికి ప్రభుత్వపరంగా వచ్చే అన్ని సహాయ సహకారాలు సకాలంలో అందజేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ గంగన్న భార్య ఎం.ప్రమీలకు మంగళవారం భద్రతా నుంచి వచ్చిన రూ.8లక్షల చెక్కును ఎస్పీ తన కార్యాలయంలో అందజేశారు. బాధిత కుటుంబానికి ఎలాంటి సహాయ సహకారాలైన జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని అన్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆరోగ్యం కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ భక్త ప్రహ్లాద, సీసీ దుర్గం శ్రీనివాస్, సూపరింటెండెంట్ గంగాధర్, ప్రెసిడెంట్ పెంచాల వెంకటేశ్వర్లు, జైస్వాల్ కవిత పాల్గొన్నారు.

తల్వార్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ :
వ్యక్తిపై కేసు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తల్వార్‌లతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకు వ్యక్తిపై సుమోటో కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. బంగారిగూడకు చెందిన సలీం ఖాన్ అనే వ్యక్తి ఇంస్టాగ్రామ్‌లో తల్వార్లతో ఒక పోస్టును పెట్టడంతో కేసు నమోదు చేశామన్నారు. ఇదివరకే సలీం ఖాన్ పలు ముఖ్యమైన కేసులలో నిందితుడుగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా ఎలాంటి వీడియోలైన సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అదేవిధంగా కత్తులతో కానీ తల్వార్లతో గాని బొమ్మ తుపాకులతో కానీ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా ఎలాంటి వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వారిపై చట్ట ప్రకారం ఆమ్స్ యాక్ట్‌లో కేసు నమోదు చేస్తామన్నారు.

మందకృష్ణ ఫ్లెక్సీకి పాలాభిషేకం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మావల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రొడ్డ గంగన్న ఆధ్వర్యంలో మంగళవారం మందకృష్ణమాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ హాజరై మాట్లాడారు. మందకష్ణ మాదిగ పోరాట ఫలితంగానే వర్గీకరణ సాధ్యమైందన్నారు. రిజర్వేషన్ ఫలాలు జాతి బిడ్డలకు అందే విధంగా ప్రతి ఒక్కరూ కషి చేసి విద్యా, సంక్షేమ, రాజకీయ రంగాల్లో మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు రొడ్డ చిన్నయ్య, సీనియర్ నాయకులు, పోతన్న, బొల్లారపు విట్టల్, కనకయ్య, రోడ్డ గంగన్న, దత్తు, ప్రదీప్, రోడ్డ సాగర్, యువకులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యంతాగితే చర్యలు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

బహిరంగ ప్రదేశాలలో మద్యంతాగితే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ (జీ) ఎస్సై సాయికిరణ్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బహిరంగంగా మద్యంతాగడం నిషేదమని ఒకవేళ అలా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని, ముఖ్య కూడళ్లలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపటిలోగా బీసీ ఆఫీసులో అందజేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని బీసీ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం అందించే ఫీజు రియంబర్స్‌మెంట్ వాటాను నేరుగా కళాశాలల అకౌంట్‌కు జమచేయనుందని, ఇందు కోసం కళాశాల యాజమాన్యాలు బ్యాంకు అకౌంట్ వివరాలు ఈనెల 27లోపు బీసీ శాఖ కార్యాలయంలో సమర్పించాలని ఆ శాఖ అభివృద్ధి అధికారి రాజలింగు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి కళాశాల తమ లెటర్‌ప్యాడ్‌పై ఖాతా వివరాలతో పాటు స్టేట్‌మెంట్ కాపీ జత చేసి సమర్పించాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు
మంత్రి పదవివ్వాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు మంత్రి పదవివ్వాలని మున్సిపల్ మాజీ చైర్మెన్ రాజురా సత్యం అన్నారు. సోమవారం స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడారు. ఖానాపూర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు మంత్రి పదవీ ఇచ్చి అడవుల జిల్లా ఆదిలాబాద్‌కు న్యాయం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఖానాపూర్ నియోజకవర్గంతో పాటు ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి వేగంగా జరగాలంటే బొజ్జు పటేల్‌కు మంత్రి పదవీ ఇస్తే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ కావలి సంతోష్, నాయకులు జన్నారపు శంకర్, పరిమి సురేష్, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ షబ్బీర్ పాష, మైనార్టీ మండలాధ్యక్షులు సలీం ఖాన్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు గుండె వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంఘ భవనంలో గుండె వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. దీనికి విశ్రాంత ఉద్యోగులతో పాటు కుటుంబ సభ్యులు హాజరై వైద్య పరీక్షలు చేయించారు. డాక్టర్ నిశికాంత్ వృద్ధులకు పరీక్షలు చేసి మందులను అందించారు. అవసరమున్న వారికి ఈసీజీ, టూడీ ఈకో లాంటి పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. విశ్రాంత ఉద్యోగులు, వయోవృద్ధుల కోసం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించామని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. వైద్యులు వృద్ధులను పరిశీలించి, అవసరమున్న మందులతో పాటు ఇతర టెస్టులను నిర్వహించారని తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి ఆయూష్మాన్ భారత్, ఈహెచ్ఎస్ కింద వైద్య సేవలు అందించేలా చూస్తామని వైద్యులు చెప్పారన్నారు. ఇక నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి హెల్త్ క్యాంప్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.